


# నిర్జీవారణ్యం

అక్కడ—

చీకటి నియంతలా రాజ్యమేలుతోంది. నిశ్శబ్దం చిక్కటి నెత్తురులా పరుచుకొనుంది. కేవలం మంచులా గడ్డకట్టుకు పోయి వుంది.

ఆ ఎత్తయిన జైలుగోడలు కాఠిన్యానికి ప్రతీకలుగా వున్నాయి. జైలు ఆవరణలో వున్న చెట్లు జుట్లు విరబోసుకున్న దెయ్యాల్లా వున్నాయి జైలు గదులు వికృత వ్యవస్థకు నిదర్శనంగా వున్నాయి.

జైలు గడియారం నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ పన్నెండు గంటలు కొట్టింది.

అదే క్షణంలో— ఓ మూలగా బాధ్యతా రహితంగా నిద్రపోతున్న సెంట్రీ వులిక్కిపడి కళ్ళు తెరిచాడు. మరు నిమిషం కర్తవ్యం గుర్తొచ్చి. ఆవులిస్తూ లేచి నిలబడ్డాడు. అనంతరం— బూట్లు టక్‌టక్ లాడిస్తూ గదుల్ని చెక్ చేస్తూ కారిడార్ వెంట నడిచాడు.

ఆ గదిలో—

కటకటాల దగ్గర కూర్చొనున్న నారాయణ బయటకు చూస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు.

అతనికి కాస్త అవతలగా రెండు చేతులూ తల కింద పెట్టుకొని, వెల్లికిలా పడుకొని వున్నాడు తులసీదాసు.

వాళ్ళిద్దరిలో ఆలోచన్లు సుళ్ళు తిరుగుతున్నాయ్. గుండెల్లో ఆవేశం వుప్పొంగుతోంది. వాళ్ళ నరాల్లో నెత్తురు వేగంగా పరుగులు తీస్తూంది

ఏదో కసి— కోపం— ఉద్వేగం వాళ్ళ శరీరాల్ని కంపింపజేస్తున్నాయ్. ఏదో చేయాలనే తపన— ఏమీ చేయలేని నిస్సహాయత!

"నారాయణా...." దాసు గొంతు గరగరలాడింది.

మెల్లిగా తల తిప్పి చూశాడు నారాయణ.

"ఇంకా ఎన్నాళ్ళు మనకీ జైలు జీవితం?"

నారాయణ సమాధానం చెప్పకుండా నిశ్శబ్దంగా వున్నాడు.

"బయటవున్న మన వాళ్ళకి మనం ఎక్కడ వున్నామో తెలీకుండా యీ వారం రోజులనుండి రోజుకో జైలు తిప్పుతున్నారు."

"మనం యీ మార్గం ఎన్నుకున్నాక మనల్ని ప్రభుత్వం బందీల్ని చేసి యిష్టం వచ్చిన మార్గాల్ని తిప్పినప్పుడు భరించక తప్పదు. దాసూ" బయట చీకట్లోకి చూస్తూ అన్నాడు నారాయణ.

"ఏయ్ నిద్రపోలే.... పడుకోండి" అప్పుడే అక్కడికి వచ్చిన సెంట్రీ లాఠీని కటకటాల మధ్య ఆడిస్తూ అన్నాడు.

ఆ లాఠీని తన చేతుల్లోకి లాక్కోవాలన్నంత కోపం వచ్చింది నారాయణకి.

సెంట్రీ ముందుకు కదిలి వెళ్ళిపోయాడు.

నారాయణకి ముప్పై యేళ్ళ వయసు వుంటుంది. విద్యార్థి దశలోనే వుద్యమాలకు నాయకత్వం వహించాడు. డిగ్రీ పూర్తిగాక ముందే నాలుగుసార్లు జైలు కెళ్ళివచ్చాడు.

చదువు పూర్తయ్యాక అతనికి వుద్యోగం యివ్వడానికి ప్రభుత్వం భయపడింది. ఉగ్రవాదిగా పేరుబడ్డ అతన్ని చూసి ప్రజలు కూడా భయపడ్డారు. ఏ విద్యార్థుల సమస్యల కోసమైతే అతడు తన జీవితాన్ని నాశనం చేసుకొని పోరాటాలు సాగించాడో, ఆ విద్యార్థులే అతన్ని చూసి దూరంగా తప్పుకున్నారు.

ఆనాటి నుండీ పార్టీ కార్యకలాపాల్లో పాల్గొంటూ, జీవితాన్ని పోరాటాలకే అంకితం చేశాడు.

రెండేళ్ళ నుండి పోలీసుల నిఘా అతని మీద వుంది. మొత్తం యిరవై మూడు కేసులు అతని మీద బనాయించి వున్నాయి- అందులో ఎనిమిది మర్డర్ కేసులు.

'దాసూ మనం యిలా కల్సుకోవడం చాలా విచిత్రంగా వుందికదూ- వొకర్నొకరం చంపుకోవాలనే చూశాం. ఇప్పుడు యీ జైలు గదిలో ప్రత్యర్థులం ఎదురెదురుగా వున్నా, ఏమీ చేసుకోలేకపోతున్నాం. ఈ జైలు గోడలు మనమధ్య మిత్రత్వాన్ని కలిపాయి కదూ" అన్నాడు నారాయణ.

బయట ప్రపంచంలో వాళ్ళిద్దరివి వేర్వేరు గ్రూపులు. వేర్వేరు నాయకత్వాలు. ఒకరి కార్యకలాపాలు మరొకరికి వుండేవికావు. వీళ్ళ చర్యల్ని వాళ్ళు ఖండిస్తూ వుండేవారు. వాళ్ళ చర్యల్ని వీళ్ళు విమర్శిస్తూ వుండేవారు.

తరుచూ వర్గ పోరాటాలు- కొట్లాటలు జరుగుతూ వుండేవి. నడి రోడ్డమీదే నెత్తురు వరదలై పారేవి. ఆ నెత్తురు మడుగుల్లో ఒకోసారి శవాలు తేలియాడేవి కూడా

దాసు మాట్లాడలేదు. చీకట్లో మసగ్గా ఆగుపడుతున్న జైలు గది పైకప్పుకేసి చూస్తుండి పోయాడు.

తులసీదాసుకి ముప్పైఅయిదేళ్ళ వయస్సు వుంటుంది. ఏ కాలేజీల్లోనూ చదవలేదుగానీ బ్రతుకు పుస్తకాల్ని చాలా చదివాడు. అతనికి భార్య, యిద్దరు పిల్లలు వున్నారు. వాళ్ళని పోషించవలసిన బాధ్యత అతని మీద ఎంతయినా వుంది.

ఓ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేస్తూ వుండేవాడు. పని వాళ్ళ శ్రమ శక్తిని యాజమాన్యం దోచుకోవడం చూశాడు. కార్మికుల కష్టాల్ని చూశాడు- దరిద్రాన్ని చూశాడు- రోగాల్ని చూశాడు.

చలించిపోయాడు శ్రమకు తగ్గ విలువ యివ్వాలని యాజమాన్యాన్ని అర్థించాడు. -కన్నీళ్ళు కార్చాడు- కాళ్ళమీద పడ్డాడు.

కుక్కను విదిల్చినట్లు విదిల్చి కొట్టారు. పందిని తన్నినట్లు తన్నారు. ఎలకను తరిమినట్లు తరిమేశారు అతడ్ని.

చివరికి తోటి కార్మికులతో కలసి సమ్మె చేశాడు. యాజమాన్యానికి, కార్మికులకు జరిగిన కొట్లాటలో, యజమానిని తల పగలగొట్టి చంప బోయాడనే నెపంతో దాసుని జైలుకి తీసుకువెళ్ళిపోయారు. జైలు నుండి వచ్చాక ఫాక్టరీలో దాసుకి స్థానం లేకుండా పోయింది.

ఆ తరువాత ఏ ఫ్యాక్టరీలోనూ అతనికి ఉద్యోగం యివ్వలేదు. జైలుకి వెళ్ళినప్పుడు తన కుటుంబాన్ని ఆదుకున్న పార్టీలో చేరిపోయాడు.

అప్పట్నుంచీ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి వుండిపోయాడు. అతి త్వరలోనే ఆ పార్టీ నాయకుడిగా స్థానాన్ని ఆక్రమించుకున్నాడు.

ఏడాదిన్నర నుండి అతని మీద పోలీసుల నిఘా వుంది. మొత్తం పదహారు కేసులు అతని మీద బనాయించి వున్నాయి- అందులో అయిదు మర్డర్ కేసులు.

"మనం బయట ప్రపంచాన్ని మళ్ళీ చూడగలమా?" నారాయణ అడిగాడు.

"ఏ భయంగావుందా?"

"లేదు. ఈ ప్రజలు చెప్పవలసింది యింకా చాలా వుంది. మన అమూల్యమైన సమయాన్ని యిలా జైళ్ళలో మగ్గబెట్టుకుంటున్నామని బాధగా వుంది."

"చాలా సమయం అయింది. ఇక పడుకో" దాసు ఆవులిస్తూ అన్నాడు.

నారాయణ చీకట్లోకి చూస్తూండి పోయాడు. దాసు నిద్రపోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

అదే సమయంలో-

కారిడార్‌లో నాలుగైదు జతల బూట్ల శబ్దాలు కరుగ్గా ధ్వనించాయి. గదుల్లో నిద్రపోతున్న ఖైదీలు వులిక్కిపడి కళ్ళు తెరిచారు. మరి కొందరు ఆత్రుతగా కటకటాల దగ్గరకు వచ్చి బయటకు చూశారు.

ఆ యినుప బూట్లు నారాయణ- దాసుల గది ముందు ఆగాయి.

లోపలున్న ఖైదీలిద్దరూ అదిరిపాటుగా లేచి నిలబడ్డారు, ఆ చీకట్లోనే ఒకరి మొహలొకరు చూసుకున్నారు.

ఏదో అవాంతరం రాబోతుందని వాళ్ళకి అర్థమౌతూనే వుంది కానీ, స్పష్టంగా ఏదీ గ్రహించలేక పోతున్నారు.

జైలు గది తెరవబడింది.

"ఊ.... బయటకు రండి" కీచుగా అరిచిందొక గొంతు.

మౌనంగా వాళ్ళిద్దరూ బయటకు వచ్చారు. అప్పటికే యిద్దరు సెంట్రీలు తుపాకులు గురిపెట్టి వుంచారు వాళ్ళకి.

బయటకు రాగానే వాళ్ళ చేతుల్ని వెనక్కి విరిచి, బేడీలు వేశారు మిగిలిన సెంట్రీలు.

తమని మళ్ళీ ఎక్కడికో తీసుకెళుతున్నారని అర్థమౌతూనే వుంది. ఇలా తీసుకువెళ్ళడం కొత్తగాదు.

సెంట్రీలు వాళ్ళని ముందుకు నడిపించారు. విచిత్రం ఖైదీలకి బేడీలు వేసివున్నా, తుపాకులు గురిపెట్టే వున్నాయి. అంటే- సెంట్రీలకు తమ శక్తిమీద తమకే నమ్మకం లేదు.


## పెళ్ళి పల్లకి

*** కమ్మవారి వధూవరులకు సంప్రదించండి. మీరేవృత్తిలో వున్నా, విదేశాలలో స్థిరపడినా మీ హోదాకు తగు సంబంధం సూచించుటకు మమ్మల్ని సంప్రదించండి. మీ వివరాలు మావద్ద రహస్యంగా వుంటాయి.**

**సప్తపది ఇన్ఫర్మేషన్ బ్యూరో**
**5-36, దుర్గానగర్, దిల్‌షుక్‌నగర్**
**హైద్రాబాద్-500 660.**

* సాంప్రదాయమైన కుటుంబానికి చెంది, ఇంటర్ పాసైన శెట్టి బలిజ కులమునకు చెందిన 22 సం॥ల యువతికి అదే కులమునకు చెందిన ప్రభుత్వ రంగంలో ఉద్యోగమందు స్థిరపడి రూ॥ 1000 లు గాని అంతకు పై సంపాదన గల 28 - 30 సం॥ల లోపు యువకుడు వరుడుగా కావలెను. ఫోటో, వివరములతో వ్రాయండి బాక్స్ నం. 214

* యస్.యస్.సి. పాసై వరంగల్లు జిల్లాలో స్వంత ఇల్లు కలిగి, మంచి కుటుంబమునకు చెందిన తెలుగు బ్రాహ్మణ వధువుకు కశ్యప గోత్రమునకు చెంది, గ్రాడ్యుయేటై ఉద్యోగమందు స్థిరపడిన 35 - 38 మధ్య వయసు, కట్నకానుకల ప్రసక్తి లేని అభ్యుదయ భావాలు గల వరుడు కావలెను. ఫోటో, వివరములతో బాక్స్ నం. 215 కేరాఫ్ పల్లకి.

కొంత దూరం నడిచాక—ఓ విశాలమైన గది లోకి వాళ్ళని తీసుకు వచ్చారు.

ఆ గదిలో—

దేదీప్యంగా వెలుగుతున్నాయ్ విద్యుత్ దీపాలు. టేబుల్‌కి ఆనుకొని, చేత లాఠీ పట్టు కొని నిలబడి వున్నాడొక యినస్పెక్టర్—అతన్ని రక్షించడానికి కన్నట్టు మరో పది మంది సెంట్రీలు అక్కడ వున్నారు.

నారాయణ, దాసుల్ని చూడగానే యినస్పెక్టర్ చిన్నగా యికిలించాడు. ఓసారి నెత్తినున్న టోపీని తీసి బట్ట బుర్ర తడుముకున్నాడు— అనంతరం లంచాలతో పెరిగిన బాన కడుపును ఆప్యాయంగా నిమిరుకున్నాడు.

రెండు నిమిషాలు ఆ గదిలో నిశ్శబ్దం—

ఆ తర్వాత— "మై డియర్ ఫ్రెండ్స్, యీ అర్ధరాత్రి వేళ మిమ్మల్ని యిక్కడకు ఎందుకు రప్పించానో తెల్సా?" అన్నాడు యినస్పెక్టర్.

వాళ్ళిద్దరూ మాట్లాడలేదు.

"మీకు తెలీదు— అసలు మీరు సంఘ విద్రోహులుగా ఎందుకు దిగజారారో నేను వూహించుకోగలను. మీరు నాతో సహకరిస్తే మీ మీదున్న అన్ని కేసుల్ని రద్దుచేసి స్వేచ్ఛగా బయటకు వదిలేసాను....ఏమంటారు—?"

దాసు చిన్నగా నవ్వాడు.

"ఎందుకలా నవ్వుతున్నావు?"

"నీ తెలివి తక్కువ తనానికి నవ్వక, ఏడ్వమంటావా?"

"యూ బాస్టర్డ్" లాఠీ, ఎత్తి దాసుమీదకు వురకబోయాడు యిన్‌స్పెక్టర్.

"ఆగు" ఆ గది దద్దరిల్లేలా అరిచాడు నారాయణ.

ఆ అరుపుకి ముందుకు రా బో యి న యిన్‌స్పెక్టర్ ఆగిపోయాడు. మిగిలిన సెంట్రీలు తుపాకుల్ని బిగింగా పట్టుకున్నారు.

"మేకతోలు కప్పుకున్నంత మాత్రాన తోడేలు మేకగా మారిపోదు. అలాగే నీవు ఎంత మంచితనాన్ని కప్పుకున్నా, మా నుంచి చిన్న రహస్యాన్ని కూడా తెలుసుకోలేవు" వ్యంగ్యంగా అన్నాడు నారాయణ.

"నా సర్వీసులో నీ లాంటి వాళ్ళని చాలా మందిని చూశాను."

"మా అనుభవంలో నీ లాంటి కాకీ బట్టల గాళ్ళని చాలా మందిని చూశాం" దాసు అన్నాడు.

"సమస్యను సామరస్యంగా పరిష్కరించుకుందాం."

"సామరస్యమే లేనప్పుడు పరిష్కారం ఎక్కడుంటుంది?"

"మీరు నా మాట వినాలి."

"మా నుంచి రహస్యాలు తెల్సుకుంటే నీకు ప్రమోషన్ వస్తుందని ఆశ కదూ."

"కాదు.... అదేంకాదూ...." మళ్ళీ కడుపు నిమురుకుంటూ అన్నాడు యినస్పెక్టర్.

మరలా నిశ్శబ్దం—

అనంతరం— "నా మంచితనం మీకు తెలీదు. కోపం వస్తే నా అంత చెడ్డవాడే లేడు. నిజం చెప్పేయండి. మీ మీ కార్యకలాపాలు ఎక్కణ్ణుంచి సాగిస్తున్నారు? మీ వెనుక యింకా ఎంతమంది వున్నారు? ప్రతిపక్షాలతో మీకేమైనా సంబంధాలు వున్నాయా?"

"అన్ని ప్రశ్నలు ఒక్కసారే అడిగేస్తే ఎలా యినస్పెక్టర్?" నారాయణ చిన్నగా అన్నాడు.


"ఒక్కొక్కటే అడిగినా— నిజం చెప్పేస్తారా?" రాబోయే ప్రమోషన్ తాలూకు ఆనందం అతని గొంతులో కదిలాడింది.

"ఫలితం లేదు యినస్పెక్టర్."

"ఎందుకు మీ జీవితాల్ని నాశనం చేసుకుంటారు...అందరిలా మీరూ ఎందుకు బ్రతకడానికి ప్రయత్నించరు? ఎన్ని అరాచకాలు సాగించినా చివరికి మా తుపాకులకు మీరు బలికాక తప్పదు."

"ఎందరు బలైనా మా పుద్యమాలు ఆగిపోవు. ఈ దేశానికి నిజమైన స్వతంత్ర్యం వచ్చేంత వరకూ మేం పోరాడుతూనే వుంటామ్" గంభీరంగా అన్నాడు దాసు.

పక పకా నవ్వాడు యినస్పెక్టర్.




వాళ్ళిద్దరూ నిర్లిప్తంగా చూస్తూ వుండిపోయారు.

"మతాతత్వాలతో మనిషికొక్క పార్టీగా చీలిపోయిన మీ కమ్యూనిజం—ఈ దేశానికి నిజమైన స్వాతంత్ర్యం తీసుకురాగలదా? ప్రజాక్షేమమే మీ ధ్యేయం అయితే, అదే మీ సిద్ధాంతం అయితే మీలో మీకే తగాదాలు ఎందుకు? రోడ్లమీద పడి నరుక్కోవడం ఎందుకు? ప్రజల్లో మీ పార్టీల పట్ల అభిమానం వుందనుకోవడం వెర్రితనమే. ఆఖరికి మున్సిపాలిటీ ఎన్నికల్లో కూడా నెగ్గలేక పోతున్నారు....యిక ఎర్రకోటపై ఎర్రజెండా ఎలా ప్రతిష్టించగలరు?"

వాళ్ళిద్దరి మొహాలు జేవురించాయి.

"కనుక మైడియర్ ఫ్రెండ్స్.... మీ మీ సిద్ధాంతాల్ని వదిలి నాతో సహకరించండి."

దాసు గొంతు పెగల్చుకొని అన్నాడు— "మా సిద్ధాంతాలో స్థిరం వుంది. కానీ మా పార్టీ మనుషుల్లోనే విభేదాలు వున్నాయి. అంత మాత్రాన నీకు తల వంచవలసిన అవసరం మాకు లేదు!"

"తల వంచమని నేను కోరడం లేదు. చేయి కలపమని అభ్యర్థిస్తున్నాను. ఏ ప్రజల కోసమైతే మీ పోరాటాల్ని సాగిస్తున్నారో, ఏ ప్రజల కోసమైతే జైళ్ళల్లో మీ జీవితాల్ని మగ్గబెట్టుకుంటున్నారో, ఏ ప్రజల కోసమైతే వురి కంబాలు ఎక్కుతున్నారో, ఆ ప్రజలే మిమ్మల్ని అసహ్యించుకొనే స్థితికి దిగజారిపోయారు మీరు. ఇప్పటికైనా కళ్ళు తెరవండి. మన రాజ్యాంగంలో వున్న లొసుగుల్ని ఎత్తి చూపండి. అమాయకులైన ప్రజల్ని మేధావులుగా తీర్చిదిద్దండి. ఎక్కడో అడవుల్లో దాక్కొని కార్యకలాపాల్ని సాగించినంత మాత్రాన— ఈ దేశానికి మీరు ఆశించే స్వాతంత్ర్యం రాదు. ప్రజల మధ్యకు రండి. ప్రజలతో కల్సి పోరాడండి. అప్పుడే మీరు కన్న కలలన్నీ ఫలిస్తాయ్."

ఆ వాగ్ధాటికి నారాయణ, దాసు మాట్లాడలేక పోయారు.

ఈ అధికారి మాటల్లో నిజం వుంది. ఆ నిజాన్ని ఏ ఉగ్రవాది అయినా అంగీకరించవలసిందే— తల వొంచవలసిందే!

"కనుక ఫ్రెండ్స్.... ఈ దేశ ప్రజల క్షేమాన్ని మీరు నిజంగా ఆశిస్తుంటే.... నేను అడగబోయే ప్రశ్నలకు సూటిగా సమాధానాలు యివ్వండి."

రెండు క్షణాలు నిశ్శబ్దం— అనంతరం—

"మిస్టర్ దాసూ. మీ స్థావరం ఏ అడవుల్లో వుందో చెప్పగలవా?"

ఉలిక్కి పడ్డాడు దాసు. ఆ అధికారి తెలివితేటలకు ఒక్కసారిగా విస్తుపోయాడు. మెత్తని మాటలతో తన నుంచి రహస్యాలు లాగడానికి ప్రయత్నిస్తున్నాడని అర్థమౌతూనే వుంది.

"కప్ టు ది ఆన్సర్."

"చెప్పను."

అంతే వూహించని వేగంతో యినస్పెక్టర్ లాఠీ దాసు భుజాన్ని బలంగా తాకింది.

కీచుగా అరిచాడు దాసు.

నారాయణ కళ్ళల్లో ఎరుపు జీరలు అలుము కున్నాయి.

"ఇదే ప్రశ్న నిన్నూ అడుగుతున్నాను నారాయణా."

అడ్డంగా తల వూపాడు నారాయణ - తన వంటిమీద పడబోయే దెబ్బను వూహించు కుంటూ.

మరు నిమిషం నారాయణ మోచిప్పలు పగిలి పోయాయి. బాధను భరించలేక చతికిలబడి పోయాడు. ఆ వెనువెంటనే యిద్దరు సెంట్రీలు వచ్చి గభాల్న అతన్ని నిలబెట్టారు.

"నాకు తెల్సు మీ నుంచి సమాధానం రాదు. ఇటువంటి లాఠీ దెబ్బలు మీకు లెక్కకాదు" అని యినస్పెక్టరు తరువాత కార్యక్రమాన్ని అమల్లో పెట్టాడు.

ఫలితంగా—

దాసు, నారాయణ గోళ్ళల్లో గుండు సూదులు గుచ్చబడ్డాయి. అరచేతుల్లో గోళీలు పెట్టి, వాటిపై కుర్చీని వుంచి యిద్దరు, ముగ్గురు ఎక్కి తొక్కారు.

హృదయ విదారకమైన అరుపులు ఆ గదిలో ప్రతిధ్వనిస్తుంటే- మరింత ఉత్సాహంగా యిన్‌స్పెక్టర్ తన అనుచరుల్ని కదిలించాడు.

మదపుటేనుగును బంధించడానికి ఒక్క గడ్డిపోచ చాలదు. ఈ దేశంలో అవినీతిని పార ద్రోలమనికి ఒక వర్గ పోరాటం చాలదు.

దాసు,నారాయణల వంటిపై బట్టలు తొలగించ బడ్డాయి. వాళ్ళ శరీరాల్ని లాఠీలతో కుళ్ళ బొడిచి, కారం పులిమారు. తలక్రిందులుగా వ్రేలాడదీశారు.

ఈ దేశపు పోలీస్‌స్టేషన్లలో మానవత్వం ఖాకీ బట్టల్ని ధరించింది. ఈ ఖాకీ కళ్ళకి పెళ్ళాం కూడా ఒకోసారి వ్యభిచారిలా కనిపిస్తూ వుంటుంది- రోడ్డునపోయే ప్రతివాడూ నేరస్తుడు లానే అగుపిస్తూ వుంటాడు.

బ్రిటిష్ వాడు నిర్మించి, వదిలి వెళ్ళిన ఈ పోలీస్ వ్యవస్థ సాధ్యమైనంత నియంతృత్వాన్ని చూపుతూ, అవసరాన్ని మించిన అధికారాన్ని చలాయిస్తూనే వుంది.

దాదాపు రెండు గంటలు గడిచాయి.

ఆ గదిలో అరుపులు ఆగిపోయాయి. ఒక్క మాట కూడా వాళ్ళ నోళ్ళలోంచి రాలేదు.

హింసను చాలా వరకూ భరించిన ఆ రెండు శరీరాలు యిక తట్టుకోలేక స్పృహ తప్పాయి.

ఒక్క నిజాన్ని కూడా కక్కించలేనందుకు యినస్పెక్టర్ కోపంతో వుగ్రుడయ్యాడు. తన అసమర్థతకు లోలోన మిక్కిలి దుఃఖించాడు. లాఠీతో తన బుర్రమీద చిన్నగా కొట్టుకుంటూ ఆలోచనలో పడిపోయాడు.

ఆ తర్వాత—

దాసు, నారాయణల్ని సెంట్రీలు యీడ్చుకుంటూ, బయట ఆగివున్న వ్యాన్‌లోకి కుక్కల్ని విసిరినట్లు విసిరి తలుపులు మూసి వేశారు.

ఆ నిశిరాత్రి వ్యాన్ ఎక్కడికో బయల్దేరింది.

మరో పది నిమిషాలు గడిచాయి.

దాసు చిన్నగా మూల్గాడు- మెల్లిగా కళ్ళు తెరిచాడు.

చీకటి

రెండు నిమిషాల వరకూ తను ఎక్కడున్నాడో అర్థంకాలేదు. వ్యాన్ శబ్దం, కుదుపుల్ని బట్టి మెల్లిగా అర్థం చేసుకోగలిగాడు. ఒళ్ళంతా పచ్చిపుండులా వుంది. నరాల్లో.... అణువణువులో పాదరసంలా సాగుతోంది బాధ.

లేచి కూర్చొని తన చుట్టూ తడిమాడు.నారాయణ శరీరం చల్లగా తగిలింది.

నారాయణా....నారాయణా" అంటూ కుదిపాడు.

రెండు నిమిషాల అనంతరం నారాయణ కదిలాడు.

గతుకుల రోడ్ మీద వ్యాన్ పరిగెడుతోంది. వ్యాన్‌కున్న జల్లెడలాంటి కిటికీల్లోంచి చల్లగా గాలి వీస్తోంది.

అతికష్టం మీద నారాయణ లేచి కూర్చో గలిగాడు. అతని శరీరంలోవున్న ఎముకలన్నీ దాదాపు విరిగిపోయి వున్నాయి - అంగాంగాల్లోంచి నెత్తురు స్రవిస్తూనే వుంది.

"నారాయణా మనం అంతిమశ్వాస విడిచే క్షణం దగ్గర పడింది దాసు కంఠం నీర్సంగా పలికింది.

"చనిపోదాం దాసూ.......హాయిగా చనిపోదాం....మన చివరి రక్తపుబొట్టు కూడా వృధాగా పోయినే ఆత్మవిశ్వాసంతోనే కన్నులు మూద్దాం."

"పొరబడుతున్నావు నారాయణా.... ఈ జాతి జనుల స్వేచ్ఛ కోసం సాగించే పోరాటంలో మన రక్తం వృధాగానే ధారపోస్తున్నాం..."

"దాసూ....!" బాధగా అన్నాడు నారాయణ.

"అవును నారాయణా... మన సిద్ధాంతాలు అన్నీ ఒక్కటే అయినా.... మనం తలోదార్ని పయనిస్తున్నాం.... మన ధ్యేయం ఒక్కటే అయినా అగమ్యాలవేపు నడుస్తున్నాం.... ఒక్కోసారి ఆలోచించు.... ఎవరికోసం యీ హింసల్ని భరిస్తున్నాం.... ఎవరికోసం దిక్కులేని చావులు చస్తున్నాం...."

నారాయణ మెదడులో ఆలోచనల వలయం తిరుగుతోంది. ఎన్నో ప్రశ్నలు అతని కళ్ళ ముందు కదులుతున్నాయి.

స్వతంత్ర్యం వచ్చి ఏళ్ళు గడిచిపోతున్నా- ఇంకా ఎక్కువైన దారిద్ర్యం- మతకల్లోలాలు- మానభంగాలు- ఆకలి చావులు- నిరుద్యోగం- రోగాలు-రొచ్చులు- ఈ సమాజం వ్యాధి గ్రస్థమైపోయింది.

ఈ వ్యవస్థకు కుష్ఠు పట్టింది.

వీటిని వదిలించడానికి తనలాంటి వాళ్ళెందరో మార్గ మధ్యంలోనే అంతమైపోతున్నారు- లేక అణిచి వేయబడుతున్నారు.

నారాయణ ఎక్కువసేపు ఆలోచించలేక పోయాడు.

"ఈ దేశంలో ఎన్నో ఎర్ర జెండాలు....కానీ, వాటిపై గుర్తులు వేరు వేరు.... ఇవన్నీ ఒక్కటిగా కలిసిన రోజున...."

"ఆ రోజు వస్తుందంటావా దాసూ....?"

"ఆశ కనుచూపుమేరలో లేదు నారాయణా ....మన నాయకుల్లో స్వార్థం తప్ప, ఐకమత్యం లేదు.... పార్టీలోంచి విడిపోయిన వ్యక్తి స్వంత పార్టీని స్థాపించుకుంటున్నాడు.... ఆ కమ్యూనిస్టు పార్టీ బలహీన పడుతోంది."

అవును! ప్రపంచ వ్యాప్తంగా ఒక్కటిగా వెలిగే సూర్యుడులాంటి కమ్యూనిజం ముక్క ముక్కలుగా చీలిపోయింది... దాసూ.... ప్రపంచ కమ్యూనిష్టులారా ఏకంకండి.... అని గొంతెత్తి అరవాలని వుంది."

"నీ అరుపులు వ్యర్థం.... నీవు ఎంత అరిచినా మన నాయకులకు వినిపించవు...."

"ప్రపంచ కమ్యూనిష్టులారా ఏకం కండి" గొంతు చించుకొని అరిచాడు నారాయణ.

దాసు ఎందుకో పకపకా నవ్వాడు.

హఠాత్‌గా వ్యాన్ ఆగింది.

ఆ తెల్లారి...

నిన్నరాత్రి అడవుల్లో జరిగిన ఎదురు కాల్పుల్లో తులసీదాసు, నారాయణ అనే ప్రముఖ ఉగ్రవాదులు మరణించారు అనే వార్తను అన్ని దిన పత్రికలు ప్రచురించాయి.

(ఈ కథ తప్పయితే క్షమించండి కామ్రేడ్స్- ఒప్పయితే ఆలోచించండి) •




డా॥పి.వి.కె.రావ్-సెక్స్‌స్పెషలిస్ట్

వైద్య విద్వాన్ వైద్యాచార్య

హస్తప్రయోగం, అంగం చిన్నదగుట, నరముల బలహీనత సుఖవ్యాధులకు; పిచ్చి, మతి భ్రమలకు ఆయుర్వేద చికిత్స పోస్టుద్వారా చికిత్సకలదు. స్వయంగా పరీక్షించి సలహాలు మందులు యివ్వగలము. ఆయుర్వేద ఇంజెక్షన్లు, విద్యుచ్ఛక్తి పరికరములతో ప్రత్యేక చికిత్స:

క్లినిక్, టి. బి. రోడ్, తెనాలి

Phone : 3700 & 4010